వాటర్ ట్యాంక్ తొలగింపు పనులు ప్రారంభం

వెంగళరావునగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలో ఆపరేషన్ వాటర్ ట్యాంక్ తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. మంగళవారం సంబంధిత శాఖ అధికారులు అక్కడికి చేరుకుని పనులను పరిశీలించారు. సుమారు 50 సంవత్సరాల క్రితం స్థానికుల అవసరాల నిమిత్తం కాలనీలో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. దానిని తొలగించేందుకు హైడ్రా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆపరేషన్ వాటర్ ట్యాంక్ చేపట్టారు. రెండు రోజుల క్రితం మట్టి కుప్పలు చదును చేశారు. చెట్లకొమ్మలు తొలగించారు. కొద్ది సేపు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వాటర్‌ట్యాంక్‌ను తొలగించడానికి భారీ కట్టర్ వాహనాన్ని, క్రేన్‌లను బుధవారం రాత్రి తెప్పించి, తెల్లవారుజామున కూల్చివేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ట్యాంక్‌ను తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే, ఎవరికీ ఇబ్బందులు కలగకుండా కూల్చివేయనున్నారు.

యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడలోని సెయింట్ మేరీస్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని వెస్ట్ మారేడుపల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్ రంజిత్ నాయక్, యూసుఫ్‌గూడ బెటాలియన్‌కు చెందిన సుమన్ మోరిస్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ర్యాగింగ్ చట్టాలు, క్రమశిక్షణా చర్యలు, ర్యాగింగ్ చేస్తూ పట్టుబడితే ఎదుర్కోబోయే పర్యవసానాల గురించి వారు వివరించారు. కళాశాల పూర్వ విద్యార్థి సాగర్ బండారి కళాశాల విద్యార్థులతో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. తొలుత లఘు చిత్రం, కార్టూన్ పెయింటింగ్ పోటీలను నిర్వహించనున్నామని, జీరో టోలరెన్స్ సందేశం వ్యాప్తి చేసేలా విద్యార్థులతో స్కిట్‌లను సైతం ప్రదర్శింపజేయనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైమోల్ క్రాస్ తెలిపారు.

క్రీడల్లో సత్తాచాటిన ట్రాఫిక్ ఏఎస్ఐ



శ్యామలకు నగదు పురస్కారం అందజేస్తున్న సీవీ ఆనంద్

బేగంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జింఖానా గ్రౌండ్‌లో ఇటీవల జరిగిన ఆఫ్ సీజన్ తెలంగాణ స్టేట్ ఛాంపియన్ షిప్-2025లో బేగంపేట ట్రాఫిక్ ఏఎస్ఐ శ్యామల సత్తాచాటారు. డిస్కస్ త్రోలో బంగారు పతకం, షాట్ పుట్ పోటీల్లో సిల్వర్ పతకాన్ని సాధించారు. మంగళవారం ఆమె నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ రూ.10 వేల నగదు పురస్కారం అందజేశారు.



సీతారామచంద్రస్వామి వారికి రజత కవచాలు అందజేస్తున్న భక్తులు

ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

బంజారాహిల్స్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14 నందినగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం వైభవంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. శ్రావణమాసంలో వచ్చే మంగళవారం పూర్వాభద్ర నక్షత్రం సంకటహర చతుర్థి స్వామివారికి ఎంతో ప్రత్యేకమైనదని ఆలయ అర్చకులు శేషశైలాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ భక్తులు శ్రీలత, మాదాల కృష్ణ, దీపిక, గోపిక, సతీష్‌రెడ్డిలు సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు 750 గ్రాముల రజత కవచాలను అందజేశారు. తమలపాకులతో అలంకరించిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిరణ్ కుమారాచార్యులు, ఆలయ చైర్మన్ దశరథ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



వెంగళరావునగర్ డివిజన్ కళ్యాణ్ నగర్ కాలనీలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోదరుడు మాగంటి వజ్రనాథ్ మంగళవారం పర్యటించారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య నాయకుడు సత్యనారాయణ, తదితరులను కోరారు.

- వెంగళరావునగర్, ఆంధ్రజ్యోతి

యువకుడిపై దాడి చేసిన
రౌడీషీటర్ అరెస్ట్

అమీర్‌పేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి చేసి సెల్‌ఫోన్ లాక్కుపోయిన రౌడీషీటర్‌తో సహా ముగ్గురిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ భీమ్‌సింగ్ సోమవారం మధ్యాహ్నం బల్కంపేట సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న ఓ పాన్‌షాప్ వద్దకు మిత్రులు సూర్య, శివ, మరో ఇద్దరితో కలిసి వచ్చాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న శ్రీకాంత్ అనే యువకుడితో అకారణంగా గొడవపడ్డారు. భీమ్‌సింగ్‌తో పాటు అతడి నలుగురు మిత్రులు శ్రీకాంత్‌పై మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా కొట్టారు. సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. ఈ మేరకు బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భీమ్‌సింగ్, సూర్య, శివను పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

బస్తీల్లో భద్రతకు ప్రాధాన్యం

- స్తంభాలపై గుట్టలుగా ఉన్న తీగలు తొలగించండి
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ



బస్తీలో పర్యటిస్తున్న ముషారఫ్ ఫరూఖీ, విద్యుత్ సిబ్బంది

హైదరాబాద్ సిటీ/బోరబండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బస్తీలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడంతోపాటు భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వ్యాప్తంగా బస్తీలు, కాలనీల్లో ఇళ్ల ముందు ప్రమాదకరంగా ఉన్న ఎల్‌టీ విద్యుత్ తీగల స్థానంలో ఎయిర్ బంచుడ్(ఏబీ) కేబుల్ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా విద్యుత్ స్తంభాలపై గుట్టలుగా పేరుకుపోయిన, వేలాడుతూ వాహనదారులు, విద్యుత్‌సిబ్బందికి అపాయకరంగా ఉన్న తీగలను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని మోతీనగర్, ఇందిరానగర్ బస్తీ, ఎచ్ఎఫ్‌నగర్, బోరబండ సైట్-2 బస్తీల్లో ఆయన ఎల్‌టీ విద్యుత్‌తీగలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్లకు అతిచేరువులో ఉన్న ఓవర్‌హెడ్ లైన్ల స్థానంలో ఏబీ కేబుల్స్ వేయడంతో చాలావరకు ప్రమాదాలు నివారించుకునే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్‌స్తంభాలకు తగిలేలా నిర్మాణాలు చేపట్టవద్దని, ప్రమాదకరంగా తీగలుంటే స్థానిక అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని మార్చే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ డిస్కం ఆపరేషన్ డైరెక్టర్ డా.నర్సింహులు, మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, బంజారాహిల్స్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కరుణాకర్ బాబు, డివిజన్ ఇంజనీర్ భీమా నాయక్, ఏడీఈ వంశీకృష్ణ, మోతీనగర్ సెక్షన్ ఏఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ మండపాల జియో ట్యాగింగ్ తప్పనిసరి



సమావేశంలో సీపీ సీవీ ఆనంద్, అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రుల సందర్భంగా సెక్టార్ ఎస్‌ఐలు తమ పరిధిలో ఏర్పాటు చేసిన మండపాల పూర్తి వివరాలు సేకరించి జియో ట్యాగింగ్ చేయాలని నగర సీపీ సీవీ ఆనంద్ సూచించారు. మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ కార్యాలయం నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారుల నుంచి ఎస్హైల వరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఇన్‌స్పెక్టర్‌లు మండపాల నిర్వాహకులతో తరచూ సమావేశాలు నిర్వహించి వారికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ సీపీలు విక్రమ్‌సింగ్ మాన్, పి.విశ్వప్రసాద్, జాయింట్ సీపీలు జోయల్ డేవిస్, పరిమళాహనా నూతన్, డీసీపీ అపూర్వారావు, పుష్పతోపాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



శ్వేతను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మహిళా కమిషన్ సభ్యురాలు శ్వేతకు సన్మానం

ఎర్రగడ్డ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ సేవలను గుర్తించి ఆమె మనమరాలు చాకలి శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియమించడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఎర్రగడ్డలోని కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీలో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వీర వనిత, తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి శ్వేత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 2022 నుంచి తెలంగాణ ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మొహ్మద్ ముహసీన్ ఖురేషి, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణ కుమార్, లయన్ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ, కళ్యాణ్ నగర్ సంక్షేమ సంఘం నాయకులు వీరేంద్రరెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, రజినీకాంత్, పులి నాయుడు, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ధర్నా



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్ట్‌ను ఎన్ఎస్‌యూఐ నేతలు ఖండించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులు యూసుఫ్‌గూడ బస్తీలో మంగళవారం నిరసన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ కేంద్రం ద్వంద వైఖరిని అవలంబిస్తూ, దేశ ప్రజల హక్కులకు భంగం కలిగిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

బంజారాహిల్స్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు, టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు ఎప్పటికప్పుడు వినూత్నంగా ఆలోచిస్తుండాలని ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజనీరింగ్ కాలేజీ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం సొసైటీలో ఎన్నో సమస్యలకు టెక్నాలజీ ఏఐ పరిష్కారాలు చూపుతున్నాయని, అయినా కూడా మానవ మేథస్సు లేకుండా ఏ టెక్నాలజీ కూడా పని చేయదని, దానిని సరిగా వినియోగించుకొని పరిష్కారాలు రాబట్టాల్సింది ప్రజలేనని అన్నారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, రిజిస్ట్రార్ నరసింహారావు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మహిపాల్ సింగ్ రావత్ పాల్గొన్నారు.

వర్షం నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి

బేగంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో వర్షం నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు ఎండీ నసీర్ ఆధ్వర్యంలో పలువురు మంగళవారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షం కురిసిన ప్రతీసారి ఇళ్లలోకి మురుగునీరు వస్తున్నాయని, రహదారుల్లో మూడు అడుగుల మేర నిల్వ ఉంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సలీంఖాన్, సిద్దిక్ ఖాన్, అయూబ్, సాయిబాబా, జమీర్, రఫీక్ పాల్గొన్నారు.

17న ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీ

పంజాగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ ఉదయపూర్‌కు చెందిన నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్నామని సంస్థాన్ మీడియా విభాగం డైరెక్టర్ భగవాన్ ప్రసాద్‌గౌర్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంస్థ ప్రతినిధులు అల్కా చౌదరి, మహేంద్ర సింగ్ రావత్, అభయ్ చౌదరి, సామాజిక కార్యకర్త జస్వత్ భాయ్ పటేల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 17న చంపాపేటలోని మినర్వా గార్డెన్స్‌లో నిర్వహించనున్న కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 6న వివిధ ప్రమాదాలలో చేతులు, కాళ్లు కోల్పోయిన వారి కోసం ఉచితంగా అవయవాల పంపిణీ కోసం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించగా 1,300 మంది హాజరయ్యారని తెలిపారు. ఇందులో 780 మందిని ఎంపిక చేశామని తెలిపారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపాలనేదే తమ ప్రయత్నం అన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

సోనియాగాంధీని కలిసిన అజారుద్దీన్



సోనియాగాంధీతో అజారుద్దీన్

బంజారాహిల్స్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మహ్మద్ అజారుద్దీన్ మంగళవారం ఢిల్లీలో కలిశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం రాహుల్‌గాంధీని కలిశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బంపర్ మెజారిటీతో గెలిచేందుకు చేస్తున్న ప్రణాళికలను వివరించారు. అనంతరం అజారుద్దీన్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అధిష్ఠానం తనకే టికెట్ కేటాయిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పది సంవత్సరాలుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలు అభివృద్ధిలో వెనకపడ్డాయని నియోజకవర్గంలో ఎవరిని అడిగినా చెప్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వందలాది సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు, వరద నీటి కాల్వలు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు.



తెలంగాణ సినిమా ఇండస్ట్రీ కార్మికులతో కరుణారెడ్డి

సినీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

బంజారాహిల్స్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సినీ కార్మికుల న్యాయమైన వేతన పెంపు డిమాండ్‌ను ప్రొడ్యూసర్ కౌన్సిల్ పరిష్కరించాలని తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఫిలింనగర్‌లోని ఫిలిం ఛాంబర్‌లో తెలుగు చలనచిత్ర మండలి సెక్రటరీ దామోదర్ ప్రసాద్, కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. నిబంధనల ప్రకారం మూడు సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణ చేసి 30 శాతం పెంచాలని ఉన్నప్పటికీ నిర్మాతలు ఆ ఊసే ఎత్తకపోవడంతో 24 విభాగాల్లోని కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుత సమాజంలో పెరిగిన అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు మోయలేని భారంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని సినీ పెద్దలు, నిర్మాతలు కార్మికుల పక్షాన ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ సి.మూర్తి, కోశాధికారి ఠాగూర్, తెలంగాణ సినిమా మీడియా స్టంట్ డైరెక్టర్స్ స్టంట్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్షుడు రాము పెరుమాల, బి.దుర్గప్రసాద్, బి. నరేష్, సి.శ్రీనివాస్, ఎం.ఫరీద్, సతీష్ కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

15న డయాలసిస్ ప్రీమియం లీగ్

పంజాగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటూ తీవ్ర నిరాశ, నిస్పృహలతో జీవనం కొనసాగిస్తున్న వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఉమీద్ చారిటబుల్ ట్రస్ట్,సాప్ కిడ్నీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో డయాలసిస్ ప్రీమియం లీగ్(డీపీఎల్) పేరుతో ఈనెల 15న ఆటల పోటీలు జరగనున్నాయి. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సాప్ కిడ్నీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ షోయబ్ అహ్మద్ ఖాన్ సాప్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ డాక్టర్ అకిబ్ అహ్మద్ ఖాన్, ఆపరేషన్స్ హెడ్ మహ్మద్ ఖాదర్, సాప్ జీఎం శివ కుమార్, హెచ్ఆర్ మేనేజర్ ముష్తాక్‌తో కలిసి డయాలసిస్ ప్రీమియర్ లీగ్ పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. బ్యాడ్మింటన్, చెస్, క్యారం, బాస్కెట్ బాల్‌తో పాటు క్విజ్ పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల డయాలసిస్ రోగులు ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9281443868లో సంప్రదించాలని వారు కోరారు.

విజ్ఞాన సంపద గ్రంథాలయం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎంతోమంది ప్రముఖులకు విజ్ఞానాన్ని అందించిన భాండాగారం గ్రంథాలయమని లాల్ బహదూర్ శాస్త్రి సేవానికేతన్ గ్రంథాలయ కోశాధికారి ఇక్బాల్ అహ్మద్ అన్నారు. కృష్ణానగర్‌లోని గ్రంథాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాంపెయిన్‌ను ప్రారంభించిన ప్రొ. సంజయ్‌శర్మ, చిత్రంలో వర్సిటీ ఉన్నతాధికారులు, విద్యార్థులు

హెచ్‌సీయూలో 'హర్ ఘర్ తిరంగా' ఊరేగింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్‌సీయూ విద్యార్థులు, ఆచార్యులు మంగళవారం జాతీయ జెండాలను చేతబూని వర్సిటీ ప్రాంగణమంతటా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ బీజేరావు మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' ప్రచార కార్యక్రమం ఆగస్టు 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. జాతీయ జెండాను ఎగురవేసి, అధికారిక వెబ్‌సైట్ 'హర్ ఘర్ తిరంగా'లో వారి సెల్ఫీలను అప్‌లోడ్ చేసి ఈ క్యాంపెయిన్‌లో పాల్గొనాలని విద్యార్థులకు, ఆచార్యులకు సూచించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సంజయ్ శర్మ, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో వైద్యులతో కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

తుల్సా.. ప్రో ప్రక్రియతో ఆధునిక చికిత్స

- ప్రొస్టేట్ క్యాన్సర్, ప్రొస్టేట్ పెరుగుదలకు చెక్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రొస్టేట్ క్యాన్సర్, ప్రొస్టేట్ పెరుగుదల సమస్యలకు ట్రాన్స్ యూరేత్రల్ అల్ట్రాసౌండ్ అబ్లేషన్ ప్రొస్టేట్ (తుల్సా-ప్రో) వంటి అత్యాధునిక పద్ధతితో చెక్ పెట్టవచ్చని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. కిమ్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహు, యూరాలజిస్ట్, యూరో-ఆంకాలజిస్ట్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ లిఖితేశ్వర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ వై.ఎం.ప్రశాంత్‌లతో కలిసి ఆయన వివరించారు. ఇది విప్లవాత్మకమైన ఎంఆర్ఐ మార్గదర్శకత్వం కలిగిన అల్ట్రాసౌండ్ ఆధారిత చికిత్స విధానమని అన్నారు. ఈ చికిత్స ద్వారా ఎటువంటి కోతలు, కుట్లు అవసరం లేకుండా ఆస్పత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. భారతదేశంలోనే కాకుండా మొత్తం ఆగ్నేయాసియాలో ఇదే మొట్ట మొదటిగా నిలిచిందన్నారు. తుల్సా- ప్రో ముఖ్యంగా వృద్ధ రోగులకు, మధుమేహం లేదా రక్తపోటు ఉన్నవారికి, శస్త్రచికిత్స ప్రమాదం ఎక్కువగా ఉండే వారికి అత్యంత అనుకూలమైన చికిత్స అని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ మున్నా, డాక్టర్ కె.వి.ఆర్. ప్రసాద్, డాక్టర్ నీల్ నరేంద్ర త్రివేది తదితరులు హాజరయ్యారు.



సోమవారం రాత్రి జరిపిన తవ్వకాలు

పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్‌కు ప్రమాదమేమీ లేదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నంలో స్కైవాక్ నిర్మాణం కోసం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కింది భాగంలో తవ్వకాలు జరుగుతున్నాయని, ఈ తవ్వకాలతో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్‌కు ప్రమాదమేమీ లేదని హెచ్ఎండీఏ తన 'ఎక్స్' ఖాతాలో మంగళవారం రాత్రి ప్రకటించింది. స్కైవాక్ నిర్మాణం కోసం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేలోని 13, 14 పిల్లర్ నంబర్ల మధ్య సోమవారం రాత్రి నుంచి తవ్వకాలు జరుగుతున్నాయి. పిల్లర్ వద్ద లోతుగా తవ్వడంతో ఫ్లైఓవర్‌కు ప్రమాదముందంటూ సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇంజనీర్ల పర్యవేక్షణలోనే పిల్లర్‌కు 2.5మీటర్ల వెడల్పు, లోతుతో తవ్వుతున్నామని హెచ్ఎండీఏ పేర్కొంది.

సీతారాం ఏచూరి జయంతి

పంజాగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ చౌరస్తాలో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి 73వ జయంతి జరిగింది. ఈ సందర్భంగా పార్టీ, ఉద్యోగ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సోషలిజం స్థాపన కోసం కార్మిక వర్గ పార్టీలో పనిచేసిన గొప్ప మేధావి సీతారాం ఏచూరి అని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ నాయకుడు వి.నాగేశ్వరరావు, పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి రాపర్తి అశోక్, పాపారావు, జితిన్ ప్రసాద్, రమణ, ముత్తయ్య, రమేష్, తిరుపాల్, ఆసిఫ్, లక్ష్మణ్ ప్రసాద్ పాల్గొన్నారు.

సౌజన్యకు 'రాష్ట్ర రతన్' అవార్డు



రాష్ట్ర రతన్ అవార్డు అందుకుంటున్న మాదాల సౌజన్య

హైదర్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ మాదాల సౌజన్య ఆ సంస్థకు చెందిన ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్ర రతన్ అవార్డుకు ఎంపికయ్యారు. హరియాణాలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును సినీనటులు మీనాక్షి శేషాద్రి, మందాకిని చేతుల మీదుగా సౌజన్య అందుకున్నారు. 2047 నాటికి భారత్‌ను అవినీతి రహిత దేశంగా మార్చేందుకు యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు కృషి చేస్తున్నట్లు సౌజన్య తెలిపారు.

ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలు

- దరఖాస్తుకు నేడు ఆఖరు

పంజాగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు నేడు ఆఖరు తేదీ అని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.రాజేంద్ర కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు, కోర్సులు తదితర వివరాలను ఆన్ లైన్‌లో పొందవచ్చని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు అధ్యయన కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖైరతాబాద్ ఫోన్ 7382929629లో సంప్రదించాలని ఆయన సూచించారు.



క్యాంపెయిన్‌ను ప్రారంభించిన ప్రొ. సంజయ్‌శర్మ, చిత్రంలో వర్సిటీ ఉన్నతాధికారులు, విద్యార్థులు

హెచ్‌సీయూలో 'హర్ ఘర్ తిరంగా' ఊరేగింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్‌సీయూ విద్యార్థులు, ఆచార్యులు మంగళవారం జాతీయ జెండాలను చేతబూని వర్సిటీ ప్రాంగణమంతటా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ బీజేరావు మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగ ప్రచార కార్యక్రమం ఆగస్టు 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. జాతీయ జెండాను ఎగురవేసి, అధికారిక వెబ్‌సైట్ 'హర్‌ఘర్ తిరంగా'లో వారి సెల్ఫీలను అప్‌లోడ్ చేసి ఈ క్యాంపెయిన్‌లో పాల్గొనాలని విద్యార్థులకు, ఆచార్యులకు సూచించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సంజయ్ శర్మ, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో వైద్యులతో కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

తుల్సా.. ప్రో ప్రక్రియతో ఆధునిక చికిత్స

● ప్రొస్టేట్ క్యాన్సర్, ప్రొస్టేట్ పెరుగుదలకు చెక్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రొస్టేట్ క్యాన్సర్, ప్రొస్టేట్ పెరుగుదల సమస్యలకు టాన్స్ యూరేథ్రల్ అల్ట్రాసౌండ్ అబ్లేషన్ ప్రొస్టేట్ (తుల్సా..ప్రో) వంటి అత్యాధునిక పద్ధతితో చెక్ పెట్టవచ్చని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. కిమ్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహు, యూరాలజిస్ట్, యూరో-అంకాలజిస్ట్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ లిఖితేశ్వర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ వై.ఎం.ప్రశాంత్‌లతో కలిసి ఆయన వివరించారు. ఇది విప్లవాత్మకమైన ఎంఆర్‌ఐ మార్గదర్శకత్వం కలిగిన అల్ట్రాసౌండ్ ఆధారిత చికిత్స విధానమని అన్నారు. ఈ చికిత్స ద్వారా ఎటువంటి కోతలు, కుట్లు అవసరం లేకుండా ఆస్పత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. భారతదేశంలోనే కాకుండా మొత్తం ఆగ్నేయాసియాలో ఇదే మొట్ట మొదటిగా నిలిచిందన్నారు. తుల్సా- ప్రో ముఖ్యంగా వృద్ధ రోగులకు, మధుమేహం లేదా రక్తపోటు ఉన్నవారికి, శస్త్రచికిత్స ప్రమాదం ఎక్కువగా ఉండే వారికి అత్యంత అనుకూలమైన చికిత్స అని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ మున్నా, డాక్టర్ కె.వి.ఆర్. ప్రసాద్, డాక్టర్ నీల్ నరేంద్ర త్రివేది తదితరులు హాజరయ్యారు.


పిల్లర్ వద్ద సోమవారం రాత్రి జరిపిన తవ్వకాలు

పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్‌కు ప్రమాదమేమీ లేదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నంలో స్కైవాక్ నిర్మాణం కోసం పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కింది భాగంలో తవ్వకాలు జరుగుతున్నాయని, ఈ తవ్వకాలతో పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్‌కు ప్రమాదమేమీ లేదని హెచ్‌ఎండీఏ తన 'ఎక్స్' ఖాతాలో మంగళవారం రాత్రి ప్రకటించింది. స్కైవాక్ నిర్మాణం కోసం పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వేలోని 13, 14 పిల్లర్ నంబర్ల మధ్య సోమవారం రాత్రి నుంచి తవ్వకాలు జరుగుతున్నాయి. పిల్లర్ వద్ద లోతుగా తవ్వడంతో ఫ్లైఓవర్‌కు ప్రమాదముందంటూ సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇంజనీర్ల పర్యవేక్షణలోనే పిల్లర్‌కు 2.5మీటర్ల వెడల్పు, లోతుతో తవ్వుతున్నామని హెచ్‌ఎండీఏ పేర్కొంది.


శిథిలావస్థకు చేరుకున్న వాంబే ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, తహసీల్దార్ అధికారులు

వాంబే ఇళ్లను కూల్చి, కొత్తవి కట్టిస్తాం

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ముట్టుకుంటే పడిపోయే స్థితిలో ఉన్న రంగానగర్ వాంబే ఇళ్లను త్వరలో కూల్చివేసి కొత్తవి నిర్మించి ఇస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బాధితులకు హామీ ఇచ్చారు. మంగళవారం రంగానగర్ వాంబే ఇళ్ల బాధితుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే సికింద్రాబాద్, ముషీరాబాద్ తహసీల్దార్, అధికారులతో కలిసి ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... వాంబే పథకం కింద 1998లో నిర్మించిన పక్కా గృహాలను 44 కుటుంబాలకు అందజేశారని తెలిపారు. ఈ ఇళ్లు పూర్తిగా శిథిలావస్తకు చేరుకున్నాయని అన్నారు. వర్షం పడితే ఏక్షణాన ఏం జరుగుతుందో అని భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన బాధితులకు ఇళ్లు కట్టించే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు రహీం, కృష్ణ, ప్రవీణ్, సుమన్, ఆరిఫ్, జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీ పాల్గొన్నారు.

వర్షం నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి

బేగంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో వర్షం నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు ఎండీ నసీర్ ఆధ్వర్యంలో పలువురు మంగళవారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షం కురిసిన ప్రతీసారి ఇళ్లలోకి మురుగునీరు వస్తున్నాయని, రహదారుల్లో మూడు అడుగుల మేర నిల్వ ఉంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సలీంఖాన్, సిద్దిక్ ఖాన్, ఆయూబ్, సాయిబాబా, జమీర్, రఫీక్ పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ సేవలు వినియోగించుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు డిజిటల్ లైబ్రరీ సేవలు వినియోగించుకుని ఉన్నతమైన పరిశోధనల దిశగా ఆలోచించాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం పిలుపునిచ్చారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సహకారంతో భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ లైబ్రరీ సైన్స్ కళాశాల సమావేశ హాల్‌లో మంగళవారం లైబ్రేరియన్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ కుమార్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను వినియోగించుకునే పద్ధతి ఆధారంగా ఫలితాలుంటాయని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ కిషన్, లైబ్రరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో ఉత్సాహంగా తిరంగా ర్యాలీ


తిరంగా రన్‌లో పాల్గొన్న కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ పల్లవి విజయ్‌వంశీ, భానుక నర్మద తదితరులు


కంటోన్మెంట్ ప్రధాన రహదారిలో భారీ జాతీయ జెండా

సికింద్రాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన తిరంగా రన్ ఉత్సాహంగా సాగింది. కంటోన్మెంట్ బోర్డు అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, కాలనీలు, బస్తీల ప్రజలు, పాఠశాల, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పెద్దఎత్తున రన్‌లో పాల్గొన్నారు. మడ్‌ఫోర్డులోని కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్ నుంచి ప్రారంభమైన రన్ పరిసరాల్లోని రహదారుల్లో కొనసాగింది. మువ్వన్నెల పతాకాల రెపరెపలతో రహదారులు కళకళలాడాయి. భారత్ మాతా కీ జై నినాదాలతో పరిసరాలు హోరెత్తాయి. కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ పల్లవి విజయ్‌వంశీ, నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, అధికారులు ఉమాశంకర్, దేవేందర్, మహేందర్, తజముల్ అక్బర్, ఆనీ, ఆశుతోష్ చౌహాన్, పుష్పేందర్ గుప్తా, అమిత్, వెంకటరమణారావు, రాజేష్, నర్సింహరాజు, రామకృష్ణ, జగ్జీవన్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో

డివిజన్‌లో బీజేపీ నాయకులు మంగళవారం హర్ ఘర్ తిరంగా అభియాన్ ర్యాలీని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వారాసిగూడ చౌరస్తాలో సుభాష్ చంద్రబోస్, పార్శీగుట్ట చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్, సంజయ్‌గాంధీనగర్‌లో మహాత్మాగాంధీ విగ్రహాలను శుద్ధి చేశారు. అనంతరం పలు వీధుల్లో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దెర శ్యాసుందర్, దత్తు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య సేవలో పాల్గొన్న బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బోయినపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ అన్నారు. బోయినపల్లి ఆరవ వార్డు పరిధిలోని మహాత్మనగర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన శిబిరాన్ని పరిశీలించి, అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో పలువురు రోగులకు ఉచిత మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, స్థానిక కాలనీ వాసులు ప్రేమ్‌కుమార్, ప్రమీల, రాజు, శ్రీను, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్‌లు కలిశారు. మార్కెట్ అభివృద్ధికి తాము తీసుకుంటున్న చర్యలు వివరించారు. మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయడానికి సహకరించాల్సిందిగా కోరారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

డ్రైనేజీ పనులు వెంటనే చేపట్టండి : కార్పొరేటర్

అడ్డగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట డివిజన్‌లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి మంగళవారం మారేడుపల్లిలోని జలమండలి జీఎం వినోద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టేందుకు త్వరగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, లాలాగూడలోని లిల్లిమోడల్ హైస్కూలు లైన్ నుంచి అడ్డగుట్ట బీసీ సెక్షన్, ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో మంచినీటి పైప్‌లైన్ పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జీఎంను కోరారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

● రూ.2లక్షల మేర నష్టం


సీతాఫల్‌మండి ఇందిరానగర్‌కాలనీ అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌లో కాలిపోయిన గది

బౌద్ధనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి ఇందిరానగర్‌కాలనీ రోడ్డు నంబర్-4లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. ఓం శ్రీసాయి బాలాజీ నిలయంలోని 104 ఫ్లాట్‌లో కర్రీ పాయింట్ నిర్వహించే కె.రాములు కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. మంగళవారం ఉదయం రాములు, అతడి భార్య హాలులో పూజ చేసి ఇంటికి తాళం పెట్టి క్యాటరింగ్ కిచెన్‌కు వెళ్లారు. హాలు కిటికీ తలుపులు తెరిచి ఉండటంతో బయట నుంచి గాలి లోపలకి రావటంతో దేవుడి పటాల వద్ద వెలిగించి ఉన్న దీపాలు కిందపడి మంటలంటుకున్నాయి. ఇంటి లోపలి నుంచి పొగ, మంటలు బయటకు రావటంతో స్థానికులు గమనించి కిటికీల ద్వారా నీళ్లను పోస్తూ, రాములుకు సమాచారమందించారు. ఫైర్ అధికారులకు ఫోన్ చేయటంతో రెండు ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చాయి. గదిలోని ఫ్రిజ్‌తో పాటు ఇతర వస్తువులు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రాములు తెలిపాడు. సంఘటన స్థలాన్ని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, సమన్వయ కర్త రాజు సుందరం సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

ఫైరింజన్ల రాకకు ఇబ్బంది

ఆషాఢ బోనాలు పురస్కరించుకుని పదిహేనురోజుల క్రితం బీఆర్‌ఎస్ నాయకుడు ప్రధానరోడ్డుకు ఇరువైపులా స్వాగత కమాన్‌ను ఏర్పాటు చేశారు. కమాన్ అడ్డుగా ఉండటంతో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లటానికి ఫైరింజన్ వాహనం డ్రైవర్ ఇబ్బంది పడ్డారు. దీంతో మరోచోట నుంచి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కమాన్ అడ్డుగా ఉండటంతో మరింత నష్టపోయామని బాధితుడు వాపోయాడు. కమాన్ ఏర్పాటుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్నపాటి వర్షానికే తడిసి ముద్దవుతున్న బోయబస్తీ

అడ్డగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి అడ్డగుట్ట డివిజన్‌లో కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోతున్నది. తుకారాంగేట్‌లోని బోయబస్తీలో చిన్నపాటి వర్షానికే రోడ్లు కంకర తేలి ప్రమాదకరంగా మారి వర్షపునీరు ఇళ్లలోకి చేరుతున్నాయి. సాయినగర్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయడంలో అధికారులు, కార్పొరేటర్ నిర్లక్ష్యం చేస్తున్నారని అడ్డగుట్ట డివిజన్ వాసులు ఆరోపిస్తున్నారు.


సాయినగర్‌లో నిలిచిన వర్షపు నీరు


బోయబస్తీలో రోడ్డుపై వర్షపు నీరు

మాలలకు న్యాయం జరిగేలా కృషి చేయాలి

● రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నాయకుల వినతి


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నాయకులు

తార్నాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో మాల సామాజిక వర్గానికి న్యాయం జరిగేవిధంగా కృషి చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నాయకులు మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును తార్నాకలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చట్టం ద్వారా జీవో నంబర్ 99 ప్రవేశపెట్టి మాల ఉద్యోగులకు, విద్యార్థులకు తీవ్రంగా నష్టం కలిగిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షలమంది మాల సామాజిక వర్గానికి చెందిన వారికి రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావుకు వివరించడం జరిగిందని, ఆయన సానుకూలంగా స్పందించి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు చెరుకు రామచందర్, తెలంగాణ విద్యార్థి జేఏసీ నాయకులు రాహుల్, సైదులు, వీరస్వామి, ప్రణయ్, రేణు కార్తీక్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యులు వడ్డేటి దేవేందర్, సంగోది పరమేష్ కుమార్, ఎం. నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం లాలాపేట్ నుంచి తార్నాక మీదుగా మాణికేశ్వర్ నగర్ వరకు హర్ ఘర్ తిరంగా యాత్ర బైక్ ర్యాలీని నిర్వహించి దేశభక్తిని చాటారు. ఈ ర్యాలీలో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, వెంకటేశ్ గౌడ్, సుక్క గణేష్ ముదిరాజ్, వేణు యాదవ్, పోచయ్య యాదవ్, బిక్షపతి, శ్రీనివాస చారి, వీరన్న, ప్రమోద్, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీగణేష్

ప్రభుత్వ స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి: శ్రీగణేష్

సికింద్రాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మార్కెట్ యార్డుకు ఆనుకుని ఉన్న ఎనిమిది ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి, నిరుపేదలకు అందించాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలకు కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో వారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కంటోన్మెంట్‌లో ఇళ్లు లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, ప్రభుత్వ స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో వారికి నీడ కల్పించినవారమవుతామని ఆయన వివరించారు.


మహాత్మనగర్ మహంకాళి ఆలయం వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న జంపన ప్రతాప్

ఘనంగా మహంకాళి ఆలయ వార్షికోత్సవం

బోయినపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మహాత్మనగర్‌లోని మహంకాళి దేవాలయం 16వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ మంగళవారం ఘనంగా నిర్వహించింది. ఉదయం అభిషేక పూజలు, హోమాలు, మహా హారతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, స్థానిక బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాజు, శ్రీనివాస్, ప్రేమ్ అసోసియేషన్ సభ్యులు, బస్తీవాసులు పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా..

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ కేంద్రశాఖ పిలుపు మేరకు రాణిగంజ్‌లోని విక్టోరియాగంజ్ చౌరస్తాలో గల అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుభ్రం చేస్తున్న రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర. కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా సహ కోశాధికారి ఎస్సార్ మల్లేష్, మాజీ డివిజన్ అధ్యక్షుడు ఆకుల ప్రతాప్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి


డ్రాపౌట్స్ విద్యార్థులను చైల్డ్‌లైన్‌కు తరలిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

చైల్డ్‌లైన్‌కు డ్రాపౌట్స్

అడ్డగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆలనా పాలనకు నోచుకోని ఇద్దరు డ్రాప్ ఔట్ విద్యార్థులను తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి, రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభ, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి సువర్ణలు మంగళవారం తుకారాంగేట్ పోలీసుల సాయంతో చైల్డ్‌లైన్‌కు తరలించారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చైల్డ్ లైన్‌కు తరలించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



చెట్టును తరలిస్తున్న పోలీసులు

ప్యాట్నీ జంక్షన్ సమీపంలో తాజ్‌మహల్ హోటల్ ఎదురుగా ఉన్న ఓ చెట్టు, దాని కొమ్మలు వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని సంబంధిత అధికారుల అనుమతులతో చెట్టును మహబూబ్ కళాశాల ఆవరణకు తరలిస్తున్న ఉత్తర మండల ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, ఇతర సిబ్బంది.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య


నందరాజు(ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మౌలాలి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ కీసర గోడుమకుంట గ్రామానికి చెందిన నంద కుమార్(28) ఆటో డ్రైవర్. కొంతకాలంగా మద్యానికి బానిసైన కొడుకును తాగవద్దని తల్లి మందలించేది. దీంతో మనస్థాపానికి గురైన అతడు మౌలాలి, చర్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హాష్ ఆయిల్ తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

బోయినపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ బోయినపల్లి అంజయ్యనగర్ సమీపంలో గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను బోయినపల్లి పోలీసులు అరెస్టు చేశారు. బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, ఎస్ఐ శివశంకర్‌లు తెలిపిన వివరాల ప్రకారం నిందితులైన సాహు సోను, బండారి రవితేజలు ఒక కిలో 77 గ్రాముల హాష్ ఆయిల్‌ను తరలిస్తున్నట్టు గుర్తించారు. ఇందులో 900 గ్రాములు, 870 గ్రాములతో కూడిన 175 చిన్న సీసాలు ఉన్నాయని తెలిపారు. నిందితులకు గతంలో గంజాయి సరఫరా నేర చరిత్ర ఉందని పోలీసుల విచారణలో బయటపడింది. స్వాధీనం చేసుకున్న సామగ్రి, నిందితులను తదుపరి చర్యల నిమిత్తం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. గిరి, రాజేష్ అనే మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.